క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరికలు



ఎంపీటీసీని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి దామోదర

రేగోడ్(మెదక్): మండలంలోని మర్పల్లి గ్రామంలో మంగళవారం బీఆర్‌ఎస్ ఎంపీటీసీ సంగీత కాంగ్రెస్‌లో చేరారని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, మాజీ ఎంపీటీసీ ఎం.నరేందర్ తెలిపారు. ఆమెకు మంత్రి దామోదర రాజనర్సింహ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారని చెప్పారు. పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని దామోదర ఆదేశించారని కిషన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, ఉపాధ్యక్షుడు గున్న సంగమేశ్వర్, నాయకులు బద్రారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

వడదెబ్బతో ఉపాధికూలీ మృతి



లక్ష్మి(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): వడదెబ్బతో ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కలకంటి లక్ష్మి(45) ఉపాధికూలీగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతుంది. మంగళవారం గ్రామ శివారులో ఉపాధి పనులు చేస్తున్న క్రమంలో సొమ్మసిల్లి పడిపోయింది. గుర్తించిన తోటి కూలీలు ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలోనే మృతి చెందింది. తీవ్ర ఎండతోనే వడదెబ్బ సోకి మృతి చెందిందని తోటి కూలీలు చెప్పారు. మృతురాలికి ఒక కూతురు ఉంది.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి



ఓటు వేశామని వేలిని చూపుతున్న టీచర్లు

నర్సాపూర్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకొని ఓటు వేయాలని ఎంఈఓ బుచ్చానాయక్, పీఆర్‌టీయూటీఎస్ నాయకులు సామ్యానాయక్, చందర్, ఇంతియాజ్ కోరారు. వారు మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకొని ఓటు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలని అన్నారు.

రైస్‌మిల్లు ఎదుట రైతులు ఆందోళన



శాలిపేట రైస్‌మిల్లు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

చిన్నశంకరంపేట(మెదక్): సన్నరకం ధాన్యం కొనుగోలులో రైస్‌మిల్లు యజమాన్యం ధర తక్కువ పెడుతున్నారని రైతులు ఆందోళనకు దిగిన సంఘటన మండలంలోని శాలిపేటలో చోటు చేసుకుంది. మంగళవారం శాలిపేటలోని రైస్‌మిల్లు ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సన్నరకం ధాన్యం నిన్నటి వరకు రూ.2400 చెల్లించి రైస్‌మిల్ యజమాని కొనుగోలు చేశాడని తెలిపారు. ప్రస్తుతం రూ.2200 మాత్రమే ధరను చెల్లిస్తానని చెబుతున్నాడని అన్నారు.ఈవిషయంపై రైస్‌మిల్లు యజమాని విజయ్‌ను ప్రశ్నించగా.. తనకు అవసరమైన మేరకు సన్నరకం ధాన్యం కొనుగోలు చేశానని చెప్పారు. రైస్‌మిల్లులో ధాన్యం నిలువ చేసేందుకు అవసరమైన చోటు లేకపోవడంతో ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు.

చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణం

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రంలో మంగళవారం శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. క్షేత్రంలో చంద్రమౌళీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 40 రోజులైన సందర్భంగా మండల ఉత్సవాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి ఆధ్వర్యంలో వేద పండితులు తెల్లవారు జామున చంద్రమౌళీశ్వరుడికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపారు. అనంతరం రుద్రహోమం, స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు.

ఉపాధికూలీలే లక్ష్యంగా పార్టీలు



సలాబత్‌పూర్‌లో బీఆర్‌ఎస్ ఉపాధిహామీ పనుల వద్ద బీఆర్‌ఎస్ ప్రచారం (ఫైల్)

- గుంపుగా ఒక్కచోట దొరికేది వారే
- మండుతున్న ఎండలు.. పదిదాటితే ప్రచారానికి ఇబ్బందే

కౌడిపల్లి(నర్సాపూర్): ఒక వైపు ఎండలు మండుతుంటే.. మరోవైపు రాజకీయం వేడేకింది. పోలింగ్ సమీస్తున్న తరుణంలో ఆయా పార్టీల నేతలు ఇంటింటికీ తిరుగుతూ.. తమ పార్టీలకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. గతంలో ఎంపీ ఎన్నికల్లో ఎప్పుడులేనంత ముమ్మరంగా వివిధ పార్టీల నాయకులు వినూత్నరీతిలో ప్రచారం చేస్తున్నారు. ఆలస్యం అయితే ఎండ మండుతుందని గ్రామాలు, తండాల్లో తెల్లారితే జనం ఉపాధి హామీ పథకంలో కూలీ పనులకు వెళ్తున్నారు. ప్రచారానికి ఉదయం పూట ఇంటి వద్ద ఎవరు ఉండటం లేదు. ఉపాధి పనుల వద్ద ఒకేచోట కూలీలు ఉండటంతో నాయకులు పనిచేసే చోటునే ఎంచుకొని అన్ని పార్టీలు అక్కడే ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

సలాబత్‌పూర్‌లో బీఆర్‌ఎస్

మండలంలోని సలాబత్‌పూర్, మర్రిచెట్టుతండా, పీర్లతండాలోల బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామాగౌడ్, ఎంపీపీ రాజునాయక్ ఆధ్వర్యంలో నాయకులు మనోహర్‌రెడ్డి, చీమల పెంటయ్య, శంకర్‌నాయక్ తదితరులు ఉపాధిహామీ పనుల వద్ద ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ కారుగుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

రాజిపేటలో కాంగ్రెస్..

మండలలోని రాజిపేటలో మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు సున్నం సతీష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెద్ద చెరువులో పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీసీ బిడ్డ నీలం మధును గెలిపించాలని ప్రచారం చేశారు.

తండాల్లో బీజేపీ..

మండలంలోని కుషన్‌గడ్డతండా మర్రిచెట్టుతండా, భుజిరంపేట తండాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు రాకేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పనుల వద్ద ప్రచారం చేసి బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావ్‌ను గెలిపించాలని కోరారు.

అభివృద్ధి కోసం బీజేపీకే ఓటు



కౌడిపల్లి(నర్సాపూర్): దేవులపల్లి తండాలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



చేగుంటలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని బీజేపీ మండలాధ్యక్షుడు రాకేశ్ తెలిపారు. మంగళవారం వెల్మకన్న, దేవులపల్లి, రాజిపేట తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీకి కేంద్రం నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘువీరారెడ్డి, రాజేందర్, అశోక్ పాల్గొన్నారు.

మండల కేంద్రంలో..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటతో పాటు పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ ప్రజల శ్రేయస్సు కోసం పాటు పడుతున్న మోదీని ప్రధానిగా చేయాలని కోరారు. మోదీ ప్రధానిగా రావాలంటే బీజేపీ తరపున ఓటీ చేస్తున్న రఘునందన్‌రావును గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్ కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణేశ్‌రవికుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జి అంజనేయులు, స్వామి యాదవ్, నాగరాజు, సాయిబాబా, సత్యం, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

రేగోడ్(మెదక్): రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ జావిద్ హెచ్చరించారు. మండల కేంద్రం రేగోడ్‌లోని వరిధాన్యం, జొన్నల కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చే రైతులకు టోకెన్లను అందజేసి తూకం వేయాలని సూచించారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

నిజాంపేట(మెదక్): గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో దొంగతనం చేసిన సంఘటన మంగళవారం మండలంలోని చల్మెడ గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని చల్మెడ గ్రామ శివారులోని పెద్దమ్మ ఆయలంలో గుర్తు తెలియని దుండగులు హుండీని పగలగొట్టి అందులోని వస్తువులు, నగదును దొంగిలించిన్నట్లు కోషాధికారి రెడ్డి యాదగిరి పేర్కొన్నారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శివ్వంపేటలో ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుతున్న రైతులు

ఈదురు గాలులతో వర్షం



కొల్చారం(నర్సాపూర్): మండలంలో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు



తూప్రాన్: ఇస్లాంపూర్‌లో రోడ్డుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం

- తడిసిన ధాన్యం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో ఒక మోస్తారు వర్షం కురిసింది. వర్షంతో మండలంలోని చాలా చోట్ల కల్లాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. తూకం వేసిన ధాన్యం బస్తాలు సైతం వర్షానికి తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

తూప్రాన్: ఈదురు గాలులతో భారీ వర్షం కురిసి పట్టణంలో భీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్డుపైన పడ్డాయి.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



బోనాల్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతుకూలీ పోరాట సమితి జిల్లా నాయకులు

చేగుంట(తూప్రాన్): తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుకూలీ పోరాట సమితి జిల్లా కన్వీనర్ స్వామి అన్నారు. మండలంలోని బోనాల్, పులిమామిడి కిష్టాపూర్, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఉచిత హామీల మాటలను పక్కకు పెట్టి రైతులకు సహకారం అందించాలన్నారు. అకాలవర్షంతో తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా తీసుకోవాలన్నారు. లేదంటే మండల కేంద్రాల్లో రైతులకు మద్దతుగా ధర్నాలు రస్తారోకోలు చేస్తామన్నారు. ఈ పరిశీలనలో ఎల్లం, మల్లేశం, బాలయ్య, మ్యాకల రాములు తదితరులు ఉన్నారు.

రఘునందన్‌రావును గెలిపించాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీను

మనోహరాబాద్(తూప్రాన్): మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని బీజేపీ మండలాధ్యక్షుడు నరేందర్ చారి ఓటర్లను కోరారు. మండలంలోని కాళ్లకల్ గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు మల్లేశ్, గోపాల్, శంకర్, కృష్ణ, రాజు, గోపాల్ తదితరులు ఉన్నారు.

హవేళిఘణాపూర్(మెదక్): దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీకి ఓటు వేసి నరేంద్రమోదీని మూడోసారి ప్రధానమంత్రిగా చేయాలని మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం హవేళిఘణాపూర్‌లో బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ... గతంలో పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కుటుంబ పాలనకే ప్రాధాన్యతనిచ్చిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అంటే కేరాఫ్ కుటుంబ పాలనగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక నేషనల్ హైవేలు, మెదక్ రైల్వేలైన్ ఏర్పాటు, హైవేల నిర్మాణం కోసం ఎన్నో కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఇప్పటికే కనుమరుగైందన్నారు. ప్రతీ ఒక్కరు బీజేపీకి ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీపాల్, ఎంఎల్‌ఎన్ రెడ్డి, మండలాధ్యక్షులు రంజిత్‌రెడ్డి ఉన్నారు.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం

నిజాంపేట(మెదక్): మండలంలోని కల్వకుంట గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీలం మధును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మోహన్ రెడ్డి, మండల మైనార్టీసెల్ అధ్యక్షుడు మొహమ్మద్ మసూద్ అలీ, అందే కొండల్‌రెడ్డి, రంగా రమేశ్, భాస్కర్‌గౌడ్, శ్రావణ్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

సురేశ్ షెట్కార్‌ను గెలిపించండి

రేగోడ్(మెదక్): జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ కుమార్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నరేందర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావ్ కులకర్ణిలు కోరారు. మండల కేంద్రమైన రేగోడ్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.విజయభాస్కర్, కోఆప్షన్ సభ్యుడు చోటుమియా, పార్టీ గ్రామ అధ్యక్షుడు శంకరప్ప, రాధకిషన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

కౌడిపల్లి(నర్సాపూర్): మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మండలంలోని తునికి హరిచంద్‌తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కొర్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్‌లో..

టేక్మాల్(మెదక్): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా టేక్మాల్‌లో జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌కుమార్ షెట్కార్ మద్దతుగా మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మ రమేశ్, టేక్మాల్ పట్టణాధ్యక్షుడు కిషోర్, సుబేదార్ మాని కిషన్, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ మజహర్, పాల్గొన్నారు.

వెల్దుర్తిలో ..

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపే ధ్యేయంగా ప్రతీ గడపకు తిరుగుతున్నారు. ప్రచారంలో జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, మల్లేశం, నర్సింహరెడ్డి, మండల నాయకులు సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్ రూరల్: ఎల్లాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఆంజనేయులు గౌడ్, నాయకులు



రేగోడ్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నర్సాపూర్ రూరల్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లాపూర్, అవంచ, మాడాపూర్ గ్రామాల్లో మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు మల్లేశ్, శ్రీనివాస్‌గౌడ్, లలిత, నర్సింగ్ నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని మండలాధ్యక్షుడు రామాగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని దేవులపల్లి, ధర్మాసాగర్ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ బస్‌యాత్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు నిధులు విడుదల చేసిందన్నారు. వరిధాన్యం సక్రమంగా కొనుగోలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజునాయక్, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సత్తయ్య, రాజు, సంతోష్‌గౌడ్, అమర్‌సింగ్ పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో కారు గుర్తుకే ఓటేసి గెలిపించాలని ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముసాపేట గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు, ప్రజలకు కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు యాదుల్‌హుస్సేన్, నాయకులు సురేశ్‌గౌడ్, నర్సింలు, వెంకట్‌రెడ్డి, మానిక్‌రెడ్డి, అడివయ్య తదితరులు ఉన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): దేవులపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

పల్లెల్లో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ వెంకట్రామ్‌రెడ్డికి మద్దతుగా చిలప్‌చెడ్ మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ మండల నాయకులు మంగళవారం జోరుగా ప్రచారం చేశారు. చిట్కుల్, బద్రాన్యతండాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారికి నమూనా బ్యాలెట్ పత్రాలు అందజేసి, వెంకట్రామ్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి, యూత్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, జగన్‌రెడ్డి, కున్యానాయక్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డిని గెలిపించండి

తూప్రాన్: మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిని గెలిపిస్తాయని జెడ్పీటీసీ రాణి అన్నారు. మండలంలోని వట్టూర్, నర్సంపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు గౌడ్, నాయకులు సత్యనారాయణ, సంతోష్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

హవేళిఘణాపూర్(మెదక్): మండలంలోని ఫరీద్‌పూర్ గ్రామంలో హవేళిఘణాపూర్ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం

మనోహరాబాద్(తూప్రాన్): మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి తరపున బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండలంలోని కాళ్లకల్ గ్రామంలో నాయకులు సుజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రవి, వెంకట్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు, భిక్షపతి, మహేందర్‌గౌడ్, మోంగ్యానాయక్, ఉదయ్‌రంజన్‌గౌడ్, కుంటరాజు, కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



బద్ర్యాదండాలో ఉపాధికూలీలకు నమూనా బ్యాలెట్ పత్రాలు ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ నిన్న కాంగ్రెస్‌లో.. నేడు బీఆర్‌ఎస్‌లో చేరిక

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాజు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సమక్షంలో తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆణపురం కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాబు, శ్రీకాంత్ ఉన్నారు. కాగా సోమవారం రోమాల రాజు దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఒక్క రోజు వ్యవధిలోనే తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరడం చర్చనీయంశాంగా మారింది.

◆ ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడిగా విష్ణు ముదిరాజ్



కౌడిపల్లి(నర్సాపూర్): బీజేపీ ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడిగా మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన గొరకంటి విష్ణును నియమించినట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ తెలిపారు. మంగళవారం ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా లింగంపల్లికి చెందిన రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా రాయిలాపూర్‌కు చెందిన సతీష్‌చారిని నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాకేశ్, కృష్ణ, బాలింగం, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హవేళిఘణాపూర్(మెదక్): రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్లు హవేళిఘణాపూర్ ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. సోమవారం కాంగ్రెస్ నిర్వహించిన బైక్ ర్యాలీలో మండలంలోని శాలిపేట మలుపు వద్ద రెండు బైక్‌లు ఢీకొని బిహార్‌కు అజిత్‌కుమార్(23) గాయాలపాలయ్యాడు. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ చెప్పారు.

◆ వృద్ధురాలు ఆత్మహత్యా యత్నం

శివ్వంపేట(నర్సాపూర్): కొడుకులు సరిగా చూడడం లేదని మనస్థాపనికి గురైన వృద్ధురాలు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని నవాబుపేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన 75 ఏళ్ల కృష్ణమ్మకు ముగ్గురు కొడుకులు ఉన్నా.. సరిగా చూడడం లేదని మనోవేదనకు గురై గ్రామ శివారులోని సాంబయ్య చెరువులోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. గుర్తించిన స్థానికులు కాపాడారు.

◆ కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం

కొల్చారం(నర్సాపూర్): మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా మంగళవారం మండలంలోని చిన్నఘనాపూర్, సదాశివ నగరం గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు గోవర్ధన్, పార్టీ ట్రెజరర్ మధుసూదన్ రెడ్డి, గ్రామాధ్యక్షుడు అశోక్, కృష్ణ, నాయకులు నాగయ్య, సావిత్రిరెడ్డి, వెంకట్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.